



ఎల్లమ్మతోటదగ్గరున్న రిక్షాస్టాండులో ఒకటే రిక్షావుంది. అతనికి బేరం తగల్లేదు లాగుంది. అతనికి సుమారు నలభయ్యేళ్ళుంటాయి. అక్కడక్కడా నెరిసిన తల, పెరిగిన గడ్డం మామూలు రిక్షావాళ్ళలాగే వున్నాడు. బాగా నల్లబడిన అతని శరీరం ఒకప్పుడు తెల్లగానే వుండి వుండవచ్చు. నెత్తిమీద మాసిన టోపీ. అక్కడక్కడా చిరిగిన బనీను. మాసిక లేసిన నిక్కరు. ఇదీ-అతని దుస్తుల వర్ణన - పాపం! అతను ఉదయం ఆరు గంటలకు రిక్షా తీసుకున్నాడు. టైము ఎనిమిదయినా బేరం ఒక్కటీ తగల్లేదు. మిగతా వాళ్ళందరూ బేరాలతో వెళ్ళిపోయారు.

అతను దిగులుగా వున్నాడు. ఇల్లు జ్ఞాపకం వచ్చింది లాగుంది. ఇల్లంటే వంగి లోనికెళ్లాల్సిన గుడిశె! అయినా వుండటానికి పనికి వచ్చేది ఇల్లేకదా! అందులో అతనూ, నలుగురు పిల్లలూ, అతనిభార్య. అతని భార్యకు అస్తమానమూ ఏదో రోగమే - అవును రిక్షావాడి భార్యకూ, గుమస్తా భార్యకూ. రోగం లేకపోతే ఇంకెవరి కుంటుంది! అతనికి మందులిప్పించడానికి డబ్బులు సరిపోవు - అయినా ఆమె అప్పుడప్పుడూ కింగ్ జార్జి ఆసుపత్రికి వెళ్తూంటుంది. ఏవో వాళ్ళిచ్చే మందులు తీసుకొని రెండు రోజులు మామూలు మనిషిగానే వుంటుంది.

ఇంతకూ రిక్షావాని పేరు రాములు. అతని పేరు స్టైల్‌గాలేదు. రాములంటే సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి పేరు. అయినా అదీ స్టైల్‌గా లేదు. మరి—రామారావని పేరుపెట్టడానికి అతని తల్లిదండ్రుల్లో కనీసం చివర - రావు - తగిలించు కొన్న చదువుకున్న వాళ్ళే లేరాయె! అందుకనే అతనిపేరు రాములయింది. కొన్ని సందర్భాల్లో "రామిగా" గాను, "రాముడు" గాను రూపాంతరం చెందుతుంది. అతనిది నిరుపేద కుటుంబం. "రిక్షావాళ్ళకు బీదతనం ఏమిటి? రోజుకు ఐదారు రూపాయలు సంపాదించు కుంటారు." అంటాడు నా స్నేహితుడొకడు - అయినా నేను మాత్రం ఒప్పుకోను. ఎందుకంటే బీదతనం లేకపోతే రిక్షా ఎందుకు లాగుతాడు? రిక్షాలాగే ప్రతివాడూ ఖచ్చితంగా బీదవాడే.

* * *

"ఏయ్ రిక్షా!" అని పిలిచాడొక స్టూడెంటు. ఆ పిలుపులో రిక్షావాళ్ళ పేర్లు 'రిక్షా'గా రూపాంతరం చెంది. మనిషిని రిక్షాతో సమానంగా చూసే భావం ధ్వనిస్తోంది. కాని రాముడికి మాత్రం తేనె జల్లులాగ, మలయ మారుతం లాగా తోచింది.

"బాబూ!" అంటూ గబ గబా రిక్షా లాక్కెళ్ళాడు

"రామ్మూర్తి పంతులు పేట వస్తావా"

"రూపాయిప్పించండి బాబూ!"

"ఉహూఁ అర్ధరూపాయిస్తా వొస్తావా?"

"చాలాదూరం బాబూ! దయుంచండి!"

"చాల్లేవయ్యా! అలా చౌల్ట్రీవరకెళ్ళానంటే పన్నెండు పైసలకు బస్సెక్కుతాను."

"ఇంకో బేడిప్పించండి బాబూ!"

"అబ్బే ఇవ్వను!" అంటూ చౌల్ట్రీవైపు నడక సాగించబోయాడు.

"రండిబాబూ" అన్నాడు రాములు. అవును. ఇప్పటివరకూ బేరం తగల్లేదు. ఉన్న ఆ బేరం కూడా పోతే ఎలాగ? కనీసం మధ్యాహ్నానికి ఇంటి దగ్గర రూపాయిన్నరైనా ఇవ్వకపోతే గంజి కూడా వుండదు. ఉదయం తాగిన టీ నీళ్ళు తప్ప ఇంకో ఆహారం లేదు. వంట్లో నిస్త్రాణగావుంది. నిజానికి రిక్షా తొక్కలేక పోతున్నాడు. అయినా సత్తువనంతా కూడదీసి తొక్కుతున్నాడు. రాత్రి నుండి వంట్లో నలతగా వున్నట్లు అనిపించింది... ఆపూట రిక్షా తొక్కకపోతే గతిలేని పరిస్థితాయె. తనే కావడంతో తన వెనకాల బరువు. రాజేశ్వరీ టాకీస్ దగ్గరకొచ్చేటప్పటికి కాళ్ళు తేలిపోతు న్నాయి. కొద్దిగా కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. కళ్ళు తిరిగినా రిక్షా తొక్కడం తప్పదు. అతనికి కావలసింది ఆ పూటకు సరిపడా డబ్బు. అంతే! సెయింట్ జోసఫ్ కాన్వెంట్ దాటింది. గాలి చల్లగా వీచింది. ఆ గాలికి కొంత ప్రాణం హాయనిపించింది. గబ గబా త్రొక్కాడు. రిక్షా చక్రాలు ముందుకు తిరుగుతున్నాయి. జ్ఞానాపురం దాటుతుండగా చైన్ వూడిపోయింది. దిగి చైనెక్కించి మరలా ఎక్కాడు. దిగి ఎక్కినమీదట ఇంకా నీరసం అనిపించిందతనికి. ఇంకెంతో దూరం లేనుకదాని లేని వుత్సాహం తెచ్చుకొని. ఆ వుత్సాహం కొంత బలంయిస్తే ఆ బలంతో గమ్యస్థానం చేర్చాడు.

"చిల్లరియ్యి" రూపాయినోటు చూపిస్తూ అడిగాడు స్టూడెంటు.

"లేదు బాబూ! తవఁరిదే బోణీ."

"అయితే పోయి చిల్లర పట్రా!" అంటూ రూపాయినోటు రాములు చేతికిచ్చాడు. దగ్గర్లోవున్న టీ కొట్లో టీ తాగి చిల్లర తెచ్చాడు. టీకి పన్నెండు పైసలయింది. మిగిలింది అరణాలు. టీ తాగిన తర్వాత అతనికి నీరసం తగ్గినట్టనిపించింది. నిజానికి టీ పనిచేసినంతగా రిక్షా వాళ్ళకి మరొకటి పనిచెయ్యదు. పేద డబ్బులకి ఆకలి తగ్గించే ఏకైక సాధనం అది. అన్నం లేకపోయినప్పటికీ టీతో గడిపిన రోజులెన్నో వున్నాయతనికి. మొన్నటి వరకూ పదిపైసల టీ ఇప్పుడు పన్నెండు పైసలయింది. అంతకుముందు అణా టీ ఇప్పుడు పేద. "ఏం రేట్లు పెరిగిపోయాయిరా బాబూ!" అనుకున్నాడు. రేట్లు పెరిగిపోయాయిరా అన్నమాట అతని నోటివెంటనే వచ్చింది. అంటే రేట్లు దారుణంగా పెరిగిపోయాయనీ, అవి తనలాంటి వారు భరించలేరనీ అతనికి బాగా తెలుసు. అయినా అతనేం చెయ్యగలడు? తిండి మానగలడా? తిండైనా మానగలడు కానీ టీ తాగడం మాత్రం మానలేడు. అదీ అతని జీవితమూ అంత ఐక్యంగా పెనవేసుకు పోయాయి. మిగిలిన అరణాలతో తిరుగుముఖం పట్టాడు టౌను వైపు. ఎవరైనా ఎక్కుతారన్న ఆశతో నెమ్మదిగా తొక్కుతున్నాడు.

పైడి తల్లమ్మ గుడొచ్చింది. అప్పుడే ఆరో నెంబరు బస్సతన్ని దాటింది. ఆ స్టాప్ దగ్గర ఆగకూడా. సామాన్యంగా బస్సురూట్లలో జనం రిక్షా లెక్కరు. ఇది డబ్బులెక్కువని నిజానికి బస్సులొచ్చి రిక్షాలను దివాలా తీయించాయి. అంటే ఆధునిక విజ్ఞానం ఇచ్చే సదుపాయం చాలామంది కడుపు కొట్టిందన్నమాట! అంటే విజ్ఞానం వద్దనీ, మనం వెనుకటి రోజుల్లోనే వుండాలని, రిక్షాలను, ఎడ్ల బళ్ళను ప్రోత్సహించమని నే నను సుమా! ఈ మధ్య "రిక్షాలు తొక్కడం నిషేధించి, వాళ్ళకు మరో వృత్తి చూపించాలి." రిక్షా త్రొక్కడం మానవత్వపు విలువలకు విపరీతమైన చులకన, నష్టం" అని అనడంలాగుంది విన్నాను. రిక్షా త్రొక్కడం మానవత్వానికి చులకనే. రిక్షా త్రొక్కడం, రిక్షానెక్కి తమతోటి మనిషిని లాగడం అంటే ఒక బానిస బ్రతుకులాంటిది! అయితే ఏ పని దొరకని రోజుల్లో, దొరికినా కడుపునిండని రోజుల్లో రిక్షా త్రొక్కడం తప్పనిసరి, పేదతనమే మానవత్వానికి ఒక పెద్ద చిక్కుప్రశ్న. అందులో ఇవన్నీ చిన్న, చిన్న భాగాలు మాత్రమే. ఒక్కొ పట్టణానికి కనీసం రెండువేల రిక్షాలున్న ఈ దేశంలో, వాళ్ళమీద ఆధారపడి కనీసం మనిషికి ఐదుగురేసివున్న దేశంలో వాళ్ళందరినీ తీసుకెళ్ళి ఒక్కసారిగా మానవత్వపు విలువలు చులకన కాని వృత్తిలో పెడితే అంతకంటే సంతోషమేముంది!!

ఆ బస్‌స్టాప్ దగ్గర రాజేశ్వరిటాకీస్ వరకు పావలాకు బేరమాడి ఒకతను కూర్చున్నాడు. రొప్పుతూ మరలా రిక్షాతొక్కాడు రాములు. రాజేశ్వరి దగ్గర అతన్ని దింపి స్టాండులో కొచ్చేప్పటికి జేబులో పదణాలున్నాయి. వొళ్ళంతా చెమటతో తడిసిపోయింది. సూర్యుడు పది గంటలమీద కాలు పెట్టాడు. బస్‌లూ, కార్లూ, స్కూటర్లు రయ్‌మంటూ పోతున్నాయి. రాములు కడుపులో ఆకలి మళ్ళా మేలుకొంది. చెమటపట్టిన కాళ్ళు, మాసిన చేతిగుడ్డతో తుడుచుకున్నాడేగాని మళ్ళా జ్వరం కాని వస్తుందా అన్నట్లు అనిపించింది. ఇంకొక రెండు గంటల్లో కనీసం రూపాయి సంపాదిస్తే ఇంటికెళ్ళి ఇచ్చిరావచ్చు అనుకున్నాడు.

"పెద్ద పోష్టాఫీసుకు వస్తావా?" వినిపించింది. రిక్షా బయల్దేరింది. మధ్యాహ్నం పన్నెండున్నర గంటల్లో రూపాయిన్నర జేబులోవుంది. రాంనగర్‌లో వున్న తన నివాసం దగ్గరకు బయలుదేరాడు. రోడ్డుమీద రిక్షాఆపి దగ్గరలోవున్న గుడిసెల వైపు బయల్దేరాడు. దారి రాళ్ళతోనూ, చెత్తతోనూ నిండి వుంది. ఒక గుడిసెలోనికి వెళ్ళాడు. లోపల అతనిభార్య ఒక చంటాడికి పాలులేని స్తన్యం గుడుపుతోంది. ఇద్దరు పడుకొని వున్నారు, కడుపులో కాళ్ళు పెట్టుకొని. పెద్దవాడు పన్నెండేళ్ళవాడు సైకిల్‌షాపులో పనిచేస్తున్నాడు. నెలకు ఆరు రూపాయిలిస్తారు. అతన్ని చూసి అతని భార్య చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులో 'ఇప్పటికైనా వచ్చావు' అన్న సంతృప్తి. 'అరే! ఈ పూట గంజిలేదే!' అన్న ఆవేదనా వున్నాయి. వెళ్ళి రూపాయిన్నర భార్య చేతిలో పెట్టాడు.

---

"ఏరా బ్రదరూ! నిన్న నీకు అమ్మిన పెన్ను దొంగదిరా - అవసరంవుండి. స్నేహితుడిని నిన్నే మోసం చెయ్యవలసి వచ్చింది" అన్నాడు బాధగా ఒక ప్రాణస్నేహితుడు.

"బాధపడకురా! నేను నీకు యిచ్చింది కూడా నీదగ్గర కొట్టేసిన డబ్బేలే!" అని ఓదార్చాడు అతను.

---

"మూడోవాడి వొళ్ళు కాలిపోతాంది! పొద్దుట్నుంచీ లెగవలేదు!" అంది. వాడి వొళ్ళు తడిమి చూచాడు. జ్వరం విపరీతంగా వుంది.

పికెలాగుందొంట్లో!" అడిగాడు.

"బాగానేవుంది" చెప్పింది.

"వస్తా!" ఆమెవంక ఆప్యాయంగా చూస్తూ చిన్నపిల్లాణ్ణి ముద్దుపెట్టుకొని బయల్దేరాడు. అతని భార్య గుడిసె బయటకు వచ్చింది. సాగనంపుతూ నీళ్ళు కార్చలేని కళ్ళల్లో వేదన స్పష్టంగా కనిపిస్తోంది. అతను మరలా తన స్టాండ్ కొచ్చేటప్పటికి నెత్తిమీద ఎండ మాడిపోతోంది. ఎదురుగుండా 'చిత్రాలయ' థియేటరు కనిపిస్తోంది. అతను సినిమా చూచి రెండు నెలలై వుంటుంది. ఆమాటే అంటే కొంతమందికి కోపం వస్తుంది. "వాళ్ళు తాగడానికే సరిపోదు! సినిమాలుకూడా ఏందుకు? పొగరుబోతు వెధవలు!" అంటారు. అటువంటి మాటలు వాస్తవానికి దూరంగానూ, నీచతనమంటే కన్నుకుట్టుగానూ, నాకు కనిపిస్తాయి

"సాయంత్రం ఆరుగంటల కిచ్చెయ్యాలి రిక్షా! రాత్రికిక తొక్కలేను" అనుకున్నాడు రాములు. సాయంత్రం వరకూ అయితే అద్దె రూపాయివ్వాలి, ఐదుగంటలవరకూ రెండు రూపాయలు సంపాదించాడు. మధ్యలో రెండుసార్లు టీ త్రాగి కొద్దిగా టిఫిన్ తిన్నాడు. మధ్యాహ్నం భోజనం లేని మూలాన విపరీతమైన ఆకలిని, ఆ రెండూ సగం తీర్చాయి. ఐదున్నరకు సినిమా వదిలేస్తారు. 'చిత్రాలయ' దగ్గరకెళ్ళి నుంచున్నాడు.

"మూడోవాడికి జ్వరంగావుంది. వాడికి మందిప్పించాలి! ఎలాగా?" అనే ప్రశ్న అతని మెదడును తొలుస్తోంది. రోజుకు వచ్చే నాలుగు రూపాయల్లో ఒక రూపాయి అద్దెకుపోతుంది. మిగిలిన డబ్బులతో కుటుంబానికి బొటాబొటి. మరునటి రోజుకు పైసుండదు. మళ్ళా కథ మామూలే! కనీసం రెండురూపాయలైనా మిగిల్తే సదాశివరావు డాక్టరు గారి దగ్గర మందిప్పించాలి అనుకున్నాడు. ఆ రెండు రూపాయలు ఈ అరగంటలో దొరుకుతాయా? "ఏమో! సమాధానం లేదు. సినిమా వదిలారు. జనం బిలబిలా పోతున్నారు. పాత పోస్టాఫీసుకు బేరం కట్టాడు, పదణాలకు ఒక జంటను. వాళ్ళను తీసుకెళ్ళి తిరిగి వచ్చేస్తున్నాడు ఖాళీగా. పూర్ణామార్కెట్ ప్రక్కనుండి పూర్ణాథియేటరు వైపుకు మళ్ళాడు మెయిన్ రోడ్డులో. ఆరుంబావైంది టైము. అక్కడున్న కొందరు రిక్షా వాళ్ళు రిక్షాలు రోడ్డుకడ్డంగా పెట్టారని, ఒక కానిస్టేబులు రిక్షాలోవున్న మెత్తల్ని క్రిందికి విసిరేస్తున్నాడు. అవి రోడ్డుమీద పడిపోతున్నాయి. రిక్షా వాళ్ళు "పోతాంబాబూ" అంటూ బ్రతిమలాడుతున్నారు.

"ఏం బతుకులామనయి! దుక్కపయం" అనుకున్నాడు రాములు. చౌల్ట్రి దగ్గరున్న తన యజమాని ఇంటికి రిక్షా యిచ్చేద్దామని బయల్దేరాడతను. రిక్షా చక్రాలు ముందుకురుకుతున్నాయి? ఆ రిక్షాయే అతని జీవనాధారం. ఆ రిక్షాయేఅతనికి కాలచక్రం. భార్య ఎప్పటికయినా ఆరోగ్యవంతురాలు ఆ రిక్షా ద్వారానే కావాలి - పిల్లల్ని భవిష్యత్తు దాని ద్వారానే బాగుపడాలి, కడుపునిండా తిండి ఆ రిక్షా ద్వారానే తినాలి. ఆ రిక్షాకున్న శక్తి అంతులేనిది. అది రాములదృష్టిలో ఒక వరప్రసాదం! కాలచక్ర పరిభ్రమణంలో మనిషెలా జీవిస్తున్నాడో అలాగే ఆ రిక్షా చక్రాలు తిరుగుతున్నంతసేపే అతని బ్రతుకు.

ప్రభాత్ టాకీస్ దగ్గర కొస్తుండగా అలంకార్ థియేటర్ ప్రక్కసందునుండి వచ్చిన స్కూటర్ రాములు రిక్షాను గుద్దింది. రాములు ప్రక్కకు పడిపోయాడు. దెబ్బలుమాత్రం తగల్లేదు. కొంచెం గీసుకోవడంతప్ప స్కూటర్ వాలా స్కూటర్‌ను స్టాండ్ వేసి రాములును లేవదీసి చెంప చెళ్ళుమనిపించాడు.

★